సాక్షి
పల్నాడు
సోమవారం, 5, జూన్, 2023



నేటితో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2023 కౌన్సెలింగ్ ముగియనుంది. సోమవారం 1,08,001వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండను ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దేవదాయ శాఖ కమిషనర్, సెక్రటరీ ఎస్. సత్యనారాయణ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

97.67శాతం పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా గుంటూరు జిల్లాలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆదివారం పెన్షన్లు అందజేశారు. జిల్లాలో ఆదివారం నాటికి 97.67 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,51,264 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.02 కోట్లు కేటాయించింది. ఆదివారం సాయంత్రానికి 2,45,416 మంది లబ్ధిదారులకు రూ.67.41 కోట్ల నగదు అందజేశారు. నేటి సాయంత్రంతో పింఛన్ల పంపిణీ ముగియనుంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

రేపు జలశక్తి మిషన్ సభ్యుల పర్యటన



జూపూడి(ఇబ్రహీంపట్నం): ఈ నెల ఆరో తేదీన కేంద్ర జలశక్తి మిషన్ సభ్యులు జూపూడిలో పర్యటిస్తారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. మండలంలోని జూపూడిలో ఆదివారం ఆయన పర్యటించి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మిషన్ కార్యదర్శి విని మహాజన్ పర్యటిస్తారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ పనితీరు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వాటి ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి తెలుసుకుంటారని పేర్కొన్నారు. కేంద్రం నిధులతో చేపట్టిన వివిధ పథకాల నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. డీపీవో జె.సునీత, ఎంపీడీవో రామకృష్ణ నాయక్, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు కేంద్రమంత్రి రాక

తిరువూరు: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖామంత్రి భారతీ పవార్ ఈ నెల 6న తిరువూరు నియోజకవర్గంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఏకొండూరులో కిడ్నీ బాధితుల్ని పరామర్శించడంతో పాటు తిరువూరు బైపాస్‌రోడ్డులోని అమరావతి ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగాన్ని ప్రారంభిస్తారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు.

కోనేరు నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నెమలి(గంపలగూడెం):జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో కోనేరు నిర్మాణానికి ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళం అందించారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన ఒద్దిరాజు మన్మదరావు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కాపూరి శశిరేఖకు అందజేశారు. దాతను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆశీర్వదించగా , చైర్మన్ స్వామి ప్రసాదం ఇచ్చారు. పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణ.. ధరిత్రి పరిరక్షణ

భానుడి భగభగలను మనం చూస్తూనే ఉన్నాం.. గతంలో కంటే ఉష్ణోగ్రతలు పెరుగుతూ మధ్యాహ్న సమయంలో రోడ్డుపైకి వెళ్లేందుకు సాహసించలేని దుస్థితిలో మనమున్నాం. ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోవడం.. అభివృద్ధి పేరుతో కాంక్రీట్ వనాలను కడుతూ, చెట్లను విపరీతంగా కొట్టేయడం.. వాహన, పరిశ్రమల కాలుష్యం..ఇలా అనేక కారణాలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భూమి వేడెక్కడం.. హిమనీనదాలు కరిగిపోవడం.. సముద్ర మట్టాలు పెరగడం.. ప్రకృతి చక్రంలో మార్పు తదితర విపత్తులు ఏర్పడ్డాయి. ఈ ముప్పు నివారించేందుకు ప్రభుత్వం 'మొక్క'వోని సంకల్పంతో ముందుకెళుతోంది. ధరిత్రి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కథనం ఇది..

పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- విరివిగా మొక్కల పెంపకం
- ప్లాస్టిక్ నిర్మూలన, నీటి పొదుపునకు ప్రత్యేక చర్యలు
- తమవంతుగా కృషి చేస్తున్న పర్యావరణ వేత్తలు, సంస్థలు
- అడవుల రక్షణకు విశేష కృషి చేస్తున్న ప్రకృతి ప్రేమికుడు అంకారావు

సాక్షి, నరసరావుపేట: పర్యావరణ సమతుల్యత దెబ్బ తినడంతో వచ్చే ప్రమాదాన్ని ధరణి ఎప్పటికప్పుడు హెచ్చరిస్తోంది. ఇకనైనా మానవాళి మేల్కొనకపోతే భవిష్యత్తు అస్తవ్యస్తం అవుతుందని వేడుకుంటోంది. ఈ ఉపద్రవం నుంచి మానవాళి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణను ఒక భాగంగా చేసుకోవాలి. మనవంతు బాధ్యతగా కాలుష్యాన్ని, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి. భవిష్యత్తు తరాలకు సహజవనరుల ధోకా లేకుండా పొదుపుగా వినియోగించుకోవాలి. మొక్కలను విరివిగా పెంచడం ఒక యజ్ఞంలా చేపట్టాలి. అప్పుడే ప్రకృతి ప్రళయాలను తగ్గిస్తూనే, ముందు తరాలకు మంచి వాతావరణాన్ని అందించిన వాళ్లమవుతాం.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ...

పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. మానవాళి మనుగడకు ప్రకృతి ఆధారమనే విషయాన్ని ప్రజలు గుర్తించేలా కార్యక్రమాలను చేపడుతోంది. అలాగే అడవుల విస్తీర్ణం పెంచడానికి విస్తారంగా మొక్కలను నాటుతోంది. అడవుల్లో జంతువులకు వసతులను కల్పించి అంతరించిపోతున్న అనేక పక్షి, జంతుజాతులను కాపాడే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ బూతం పర్యావరణానికి చేస్తున్న హానిని గుర్తించి ప్లాస్టిక్‌పై నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తోంది. పరిశ్రమల్లో కాలుష్యం, ప్రమాదకర పదార్థాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, భారీ జరిమానాలు విధిస్తున్నారు. విద్యార్థులను పర్యావరణ పరిరక్షణకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా వినియోగించి, వారిని భాగస్వామ్యులను చేస్తోంది. ప్రకృతి పరిరక్షణలో భాగం పంచుకుంటున్న పర్యావరణవేత్తలు, సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.



కారెంపూడి కొండలపై మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు



నల్లమల అటవీ ప్రాంతంలోని నీటి కొలనులో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుతున్న అంకారావు

అడవికి అండగా అంకారావు...

తల్లిలాంటి అడవికి ఆపద వస్తే నేనున్నానంటూ ఓ పుడమిపుత్రుడు అండగా నిలుస్తున్నాడు. పాతికేళ్లుగా అడవుల రక్షణకు అవిరళ కృషి చేస్తూ ప్రకృతిని పరిరక్షిస్తున్నాడు. దట్టమైన నల్లమల అటవీప్రాంతంలో ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని ఏరుతూ, మూగజీవాల ప్రాణాలను రక్షిస్తున్నాడు కారంపూడికి చెందిన కొమెర అంకారావు ఉరఫ్ జాబి. పార్టీల పేరుతో అటవీప్రాంతంలో యువత పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, మందు సీసాలు తొలగించి, అడవిని శుభ్రం చేయడమే ఆయన దినచర్య. అడవిలో అంతరించిపోతున్న వృక్షజాతుల విత్తనాలను సేకరించి వాటికి ప్రాణం పోస్తున్నారు. తొలకరి వస్తే చాలు అంకారావు అడవిలో ఎత్తయిన ప్రాంతాలకు వెళ్లి విత్తనాలు చల్లుతారు. పక్షుల మేత కోసం సేంద్రీయ సాగు చేపట్టి వాటికి ఆహారం కొరత లేకుండా చూస్తున్నారు. అంకారావు సేవలను గుర్తించిన మద్రాసు ప్రైవేట్ వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

బజరంగ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

కొరిటెపాడు(గుంటూరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జగన్నామ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఏడాది కాలంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి వివిధ కార్యక్రామలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా గత ఫిబ్రవరి 20వ తేదీన పల్నాడు జిల్లా కోటప్పకొండలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్లాస్టిక్ గ్లాసులను ఏరివేసి శుభ్రం చేయడం జరిగిందని తెలిపారు. ఇటీవల బాపట్ల బీచ్‌లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి వేయడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోజు వారి జీవితంలో మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ప్రజలను భాగస్వాములను చేస్తున్నాం...



పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. అందులో జిల్లా ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం. ముఖ్యంగా వారికి పర్యావరణానికి జరుగుతున్న హాని, దాని దుష్ప్రభావాలు, తీసుకోవాల్సిన చర్యలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ , ఇ–వ్యర్థాలను అరికడుతున్నాం. ఈ వర్షాకాలంలో లక్ష మొక్కలను నాటేందుకు సిద్ధంగా ఉన్నాం. మరోవైపు దాతల సహకారంతో కొండవీడులో 10 వేల పెద్ద మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– ఎస్.రామచంద్రరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి

హామీలకు విలువ ఇచ్చిన సీఎం జగన్

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

పట్నంబజారు: ఇచ్చిన మాటకు కట్టుబడే నైజం ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు హిందూ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం 'మేనిఫెస్టో అంటే జగన్' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ముందుగా ఒడిశా రైలు ప్రమాద మృతులకు సంతాపాన్ని తెలియజేస్తూ.. రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అనంతరం కొమ్మినేని మాట్లాడుతూ 2019 వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే సరికి కనీసం రూ.100 కోట్లు కూడా లేకుండా చంద్రబాబు ఖజనాను ఖాళీ చేశారన్నారు.

సీఎం జగన్ హామీలన్నీ నెరవేర్చారు : మంత్రి అంబటి

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు.. అమలు చేసిన వైనాన్ని.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు.. అమలు చేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. మేనిఫెస్టో తీసుకుని ప్రతి గడపకు వెళ్లే ధైర్యం తమ నాయకుడు సీఎం వైఎస్ జగన్ తమకిచ్చారన్నారు.

చంద్రబాబు మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో లేకుండా చేశారు : ఉమ్మారెడ్డి

శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో మేనిఫెస్టో చించివేసిన పరిస్థితులు ఉన్నాయని, చంద్రబాబు వెబ్‌సైట్‌లో లేకుండా చేసిన దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయన్నారు.

టీడీపీ నేతల్లోనే ఆందోళన : డొక్కా

సభాధ్యక్షత వహించిన డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను చూసి టీడీపీ నేతల్లోనే ఆందోళన మొదలైందని, ఇటువంటి హామీలు కేవలం అధికారం కోసం ఇవ్వటమేనన్న విషయం ప్రతి ఒక్కరికీ అర్థమైందన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ ముస్తఫా, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నంలు మాట్లాడారు.

• ఏరువాక పౌర్ణమి



సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో నాగలిపట్టి ఏరువాక ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఆగిఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు
- బస్సులో 40 మంది ప్రయాణికులు.. త్రుటిలో తప్పిన ఘోరప్రమాదం

గురజాల: అద్దంకి – నార్కెట్‌పల్లి హైవేపై త్రుటిలో ఘోర రోడ్డు ప్రమాదం తప్పిపోయింది. దాచేపల్లి సీఐ బిలాలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కందుకూరుకు వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు మార్గం మధ్యలో దాచేపల్లి దగ్గర దావత్ రెస్టారెంట్ వద్ద ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. పంక్చరై రోడ్డు పక్కన నిలిపిఉన్న లారీని ట్రావెల్ బస్సు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఢీకొట్టి ఉంటాడని పోలీసలు తెలిపారు. ఈ ప్రమాదంలో క్షతగాత్రులను 108 వాహనం ద్వారా గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తీసుకురాగా చికిత్స పొందుతూ ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన గడ్డం గోపి (39) మృతిచెందినట్లు మరొక ఐదుగురు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



ట్రావెల్ బస్సును పొక్లెయిన్ సహాయంతో పక్కకు తీస్తున్న దృశ్యం

డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే..!

ఆగివున్న లారీని ఢీకొట్టడంతో బస్సు ముందు భాగం వరకు లారీలోకి దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఘటన జరిగిందని, త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పిపోయిందని పలువురు ఊపిరిపీల్చుకున్నారు. ప్రయాణికులు మరొక బస్సులో వారి గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. బస్సును పొక్లెయిన్ సహాయంతో బయటకు తీశారు.

పెద్దాసుపత్రిలో పెద్ద 'సాయం'

- హైరిస్క్ గర్భిణి కేసులను పల్నాడు జిల్లా నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలింపు
- గర్భిణులకు సహాయంగా ఉండేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసిన పల్నాడు వైద్య ఆరోగ్య శాఖ
- మూడు షిఫ్ట్‌ల వారీగా పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు
- పల్నాడు నుంచి వచ్చే రోగులకు త్వరితగతిన వైద్యం అందేలా చర్యలు
- 24 గంటల పాటు రోగులకు అవసరమైన సేవలు అందుతాయంటున్న ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ సునీల

సాక్షి, నరసరావుపేట: మహిళలకు ప్రసవం పునర్జన్మతో సమానం. బిడ్డకు జన్మనివ్వాలంటే చచ్చి బతకాల్సిందే. అదే హైరిస్క్‌లో ఉన్న గర్భిణుల పరిస్థితి మరి క్లిష్టంగా ఉంటుంది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండటానికి వారిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వారికి అవసరమైన పౌష్టికాహారం, ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. ప్రసవానికి రెండు మూడు రోజుల ముందే వారికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉంచడానికి జిల్లా పెద్దాసుపత్రులకు ప్రభుత్వమే రవాణా ఖర్చులు భరించి తరలిస్తున్నారు. పల్నాడు జిల్లాలో సైతం ఇదేవిధంగా హైరిస్క్ ఉన్న గర్భిణులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించి, సుఖ ప్రసవం అయ్యేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఐతే జిల్లా విభజన తర్వాత గుంటూరు జీజీహెచ్‌కు వెళుతున్న పల్నాడు గర్భిణులకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఓ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయమని వైద్య అధికారులను ఆదేశించారు.



గుంటూరు జీజీహెచ్‌లో పల్నాడు హెల్ప్ డెస్క్‌లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్ర

పల్నాడు హెల్ప్ డెస్క్...

కలెక్టర్ ఆదేశాల మేరకు పల్నాడు ప్రాంతం నుంచి వెళ్లే గర్భిణులకు ఉపయుక్తంగా ఉండేలా పల్నాడు హెల్ప్ డెస్క్‌ను గుంటూరు జీజీహెచ్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటు చేశారు. అందులో మూడు షిఫ్టుల వారీగా ముగ్గురు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆరోగ్య మిత్రలను నియమించారు. అక్కడికి వైద్యం కోసం వెళ్లిన గర్భిణులతో హెల్ప్ డెస్క్ సిబ్బంది మాట్లాడి వారికి అవసరమైన సమాచారం, సూచనలు అందజేస్తారు. సత్వరమే మెరుగైన వైద్యం అందేలా హెల్ప్ డెస్క్ సిబ్బంది వైద్యులు, గర్భిణుల మధ్య వారధిగా పనిచేస్తున్నారు.

దీని వల్ల హైరిస్క్‌తో ఉన్న గర్భిణులకు సమయం వృథా కాకుండా, కంగారుపడకుండా వెంటనే వైద్యం అందుతుంది. వైద్యం అనంతరం బాలింత, చిన్నారిని ఇంటికి ఉచితంగా తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పంపించేవరకు ఆరోగ్య మిత్రలు సహాయంగా ఉంటారు. దీంతో తల్లి, బిడ్డ ఇద్దరు సురక్షితంగా ఇంటికి చేరడానికి ఉపయుక్తంగా పల్నాడు హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతోంది.

24 గంటలు అందుబాటులో హెల్ప్ డెస్క్



గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన పల్నాడు జిల్లా హైరిస్క్ గర్భిణులు ఇబ్బందిపడకూడదన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలతో పల్నాడు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశాం. ఇందులో ముగ్గురు ఆరోగ్య మిత్రలు షిఫ్టుల వారీగా 24 గంటలు అందుబాటులో ఉంటారు. గర్భిణులకు సత్వరమే, మెరుగైన వైద్యం అందుతోంది. ఈ సదుపాయాన్ని జిల్లాకు చెందిన గర్భిణులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ సునీల, పల్నాడు జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్

ఎంతో ఉపయోగపడుతోంది



ప్రసవం కోసం రెండు నెలల క్రితం గుంటూరు జీజీహెచ్‌కు నన్ను తరలించారు. అక్కడ పల్నాడు హెల్ప్ డెస్క్ సిబ్బంది మాకు అవసరమైన సలహాలు అందజేశారు. వెంటనే తగిన వైద్యం అందేలా వారు మాకు సహాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లిన మాలాంటి వారికి హెల్ప్‌డెస్క్ ఎంతగానో ఉపయోగపడుతోంది.

– షేక్ రేష్మ, బాలింత, పిన్నెల్లి, మాచవరం మండలం

ముఖ్యమంత్రి రాకకు ఏర్పాట్లు పరిశీలన

క్రోసూరు: ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా క్రోసూరు రానున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకరరెడ్డి, జేసీ ఎ.శ్యాంప్రసాద్ ఆదివారం పరిశీలించారు. క్రోసూరు నుంచి జగనన్న విద్యాకానుక కార్యక్రమాన్ని ప్రారంభించటంతో పాటు, పలు అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నట్టు తెలిపారు. ఈమేరకు క్రోసూరు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల, మోడల్ స్కూల్, బయ్యవరం, ఊటుకూరు జెడ్పీ పాఠశాలలను పరిశీలించారు. అనంతరం క్రోసూరు మోడల్ స్కూల్లో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు బందోబస్తు నిర్వహణ, పార్కింగ్, హెలిప్యాడ్, రూట్‌మ్యాప్, శంకుస్థాపన, ప్రారంభోత్సవ ప్రాంతాలు, బహిరంగ సభ నిర్వహించే ప్రాంతం మొత్తం పటిష్ట భద్రత ఏర్పాట్లుపై చర్చించారు. అమరావతి నుంచి బెల్లంకొండ మండలాలను కలుపుతూ డబుల్‌లైన్ ప్రధాన రహదారి, మాదిపాడు వద్ద కృష్ణానదిపై భారీ వంతెన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్రోసూరు శివారులో అమరావతి రోడ్డు విప్పర్లగ్రామం వద్ద నూతనంగా నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి బహిరంగ సభలో మాట్లాడతారని వివరించారు. సమీక్షా సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ మోహన్‌రావు, జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఈఓ శామ్యూల్, జిల్లా రహదారులు, భవనాలశాఖ అధికారి రాజునాయక్, ఆర్డీఓ రాజకుమారి, ఆయా శాఖల జిల్లా అధికారులు, డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామి పాల్గొన్నారు.



క్రోసూరు జెడ్పీపాఠశాలలో సీఎం సభ వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర రెడ్డి

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

- సాగు లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి
- సంస్కృతి, సాంప్రదాయాలు కొనసాగించేందుకు ఏరువాక
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: విప్లవాత్మకమైన సంస్కరణలు, సాహసోపేతమైన నిర్ణయాలతో వ్యవసాయానికి పరిపుష్టి కల్పిస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని ధూళిపాళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఏరువాక కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పార్టీ రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. ముందుగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్‌తో కలిసి పూజలు చేసి, దుక్కి దున్ని ఏరువాకను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రితోపాటు ఎమ్మెల్సీ ఏసు రత్నం, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణలు ఉన్నారు. అంబటి మాట్లాడుతూ ఈ తరం వారికి వ్యవసాయంపై మక్కువ పెంచేందుకే ప్రతి ఏడాదీ సంస్కృతి, సాంప్రదాయాలతో ఏరువాక నిర్వహిస్తున్నామన్నారు. గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో కొనసాగిస్తామన్నారు. వర్షపు నీటిని వృథా కానీయకుండా ఉప్పు నీటిలో కలిసి పోనివ్వకుండా రైతులకు సిరులు కురిపించేందుకే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం ప్రారంభించారని, ఇందులో భాగంగా పోలవరం ప్రాజెక్టును ఆయన భూమి పూజ చేస్తే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో ముందస్తుగానే సాగునీరు అందిస్తున్నామన్నారు. ఈనెల 7న కృష్ణా డెల్టాకు, జూలై చివరలో సాగర్‌కు సాగునీరు విడుదల చేస్తున్నామని ఆయన వివరించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ప్రారంభించినప్పటి నుంచి ప్రకృతి రైతులకు సహకరిస్తూనే ఉందన్నారు. ఒక మిర్చి యార్డులోనే గతేడాది రూ.805 కోట్ల వ్యాపారం అందించామన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ భూమిని నమ్ముకున్న రైతు ప్రకృతితో మమేకమవుతాదన్నారు. వ్యవసాయ అధికారులు కౌలు రైతులకు న్యాయం చేయాలని సూచించారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులందరికీ ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో పుట్టినా సాగుకు దూరంగానే ఉన్నామని, అయినా రైతు సమస్యలు అర్థం చేసుకొని అసెంబ్లీలో వారి సమస్యల పరిష్కారం కోసం చర్చించానన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఏ మురళి, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పల్నాడు జిల్లా వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, డాక్టర్ గీతాహసంతి తదితరులు మాట్లాడారు. వేదికపై నాయకులందరూ సంప్రదాయ పంచకట్టు, తలపాగతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్లం విజయభాస్కర రెడ్డి, ఎంపీపీ యలవర్తిపాటి జైబున్ బి, సర్పంచ్ మహాలక్ష్మి, ఉప సర్పంచ్ కుంభా లక్ష్మి, ఎంపీటీసీ వీరమ్మ, మండల కన్వీనర్లు ఏపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, అచ్యుత శివ ప్రసాద్, నల్లబోతు శివనారాయణ, చిలక జైపాల్, స్థానిక నాయకులు ఉన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్


పీహెచ్‌సీలో డాక్టర్ బాల అంకమ్మబాయితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

క్రోసూరు: పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది రోగుల పట్ల పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, రోగుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా కలెక్టర్, అధికారులు క్రోసూరులో 12న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన గురించి సభావేదిక పరిశీలనకు హాజరైన సందర్భంగా మండలకేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీలో విధుల్లో ఉన్న వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి, సిబ్బంది పనితీరు పట్ల అసహనం వ్యక్తపరిచారు. తనకు ప్రజలను పీహెచ్‌సీ నుంచి పలు రకాలుగా ఫిర్యాదులందుతున్నాయని, ఎందుకని అని ప్రశ్నించారు. రోగులు వస్తే సత్తెనపల్లి వెళ్లాలని సూచిస్తున్నట్లు చెబుతున్నారని ఎందుకలా చెబుతున్నారని నిలదీశారు. ఆసుపత్రి సిబ్బంది రికార్డు పరిశీలించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంకు వెళ్తున్న వైద్యురాలు డాక్టర్ ప్రవీణదీప్తి గురించి వాకబు చేశారు. ఈ సారి ఏదైనా సమస్యలున్నట్లు తెలిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో అవసరమైతే పీహెచ్‌సీ సందర్శిస్తారని, అందుకు సంసిద్ధంగా ఉండాలని కోరారు.

మైనర్ బాలికకు లైంగిక వేధింపులు

- ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరింపులు
- రూ.3లక్షలు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాలిక
- కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలింపు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన

పెదకూరపాడు: మైనర్ బాలికను లైంగికంగా వేధించి, ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించి డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెదకూరపాడు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన చిరుమామిళ్ల కృష్ణప్రసాద్ ఓ మైనర్ బాలికను ఏడాది నుంచి లైంగికంగా వేధిస్తున్నాడు. అంతేగాక డబ్బులు ఇవ్వాలని లేనిపక్షంలో బాలిక ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇలా ఇప్పటి వరకు సుమారు రూ.3 లక్షలకు పైగా తీసుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. డబ్బులు తీసుకోవడంతోపాటు ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులతో కలసి పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడు కృష్ణప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేసి సత్తెనపల్లి రెండో అదనపు కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉల్లాసంగా రాష్ట్ర స్థాయి పోల్ రాధా పోటీలు


బండ లాగుతున్న గుంటూరు ఎడ్ల జత

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల పురస్కరించుకొని ఆదివారం రాత్రి రాష్ట్ర స్థాయి జూనియర్ నాటు ఎడ్ల పోల్ రాధా పోటీలు రసవత్తరంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన సుమారు 16 ఎడ్ల జతలు ఈ పోటీలలో పాల్గొన్నాయి. 300 మీటర్ల పొడవు, రెండు క్వింటాళ్ల ఇసుక బస్తాలను వేసుకొని బండిని లాగాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నీరకట్టు రామారావు హాజరయ్యారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎంపీ మోపిదేవి


క్రికెట్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: క్రీడలు శారీరిక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. నిజాంపట్నంలో ఆదివారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథబాబుల ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఎంపీ మోపిదేవి టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు.రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు, 4వ బహుమతి రూ.25వేలు అందిస్తామని తెలిపారు.అనంతరం గ్రౌండ్‌లో ఎంపీ మోపిదేవి సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరినాథబాబు, నాజర్‌ఖాన్, నాయుడు వెంకటేశ్వరరావు, దిండి సరన్పంచ్ యేమినేని రాంబాబు, జమీర్, చెన్ను లక్ష్మణరావు(ఎల్‌జి)తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష ఆర్థిక సహాయం

మండలంలోని గుర్నాధనగర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఈ నెల 11వ తేదీ అంబేడ్కర్ విగ్రహాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావును ఆదివారం గ్రామస్తులు కలిసి కోరారు. తప్పనిసరిగా విగ్రహావిష్కరణకు వస్తానని హామీనిచ్చి విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ అశోక్, గ్రామస్తులకు ఎంపీ మోపిదేవి అందజేశారు.

మానసిక సమస్యలతో లారీ డ్రైవర్ ఆత్మహత్య

మార్టూరు: ఒంటరితనం ఆపై మానసిక సమస్యలతో ఓ లారీ డ్రైవర్ తాను నిత్యం నడిపే లారీ టైర్ల కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని జంగమహేశ్వరపురంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ కమలాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చిలకా భాస్కర్ బాబు (55) చాలా కాలంగా జంగమహేశ్వరపురంలోని ఏ. ప్రభాకరరెడ్డికి చెందిన క్రషర్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలి కాలంలో అనారోగ్యం కారణంగా భార్య మరణించింది. అప్పటి నుంచి భాస్కర్‌బాబు ఒంటరితనంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గతంలో ఒకసారి ఆత్మహత్యాయత్నం చేయగా స్థానికులు గుర్తించి కాపాడారు. ఆదివారం ఉదయం భాస్కర్ బాబు తాను నిత్యం నడిపే లారీ వద్దకు వెళ్లి లారీని గేరు నుంచి న్యూట్రల్ చేయడంతో కిందకు దిగే క్రమంలో లారీ కుడివైపు వెనక టైర్ల కింద తలపెట్టి పడుకున్నాడు. లారీ భాస్కర్‌బాబు తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రత్నకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కమలాకర్ ఘటనా స్థలికి వెళ్లి భాస్కర్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కేసులు



నగరంపాలెం: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే మందుబాబులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగి, అసాంఘిక కార్యకలపాలు నిర్వహించే 2,379 మందిపై 2,215 కేసులు నమోదయ్యాయి. గత కొన్ని రోజులుగా జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతున్న విషయం విదితమే. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తప్పవని ఎస్పీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మందుబాబులపై కేసుల నమోదు చేయడం వల్ల జిల్లా వ్యాప్తంగా నేరాల సంఖ్య తగ్గాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల కేసులు కూడా అదుపులో ఉన్నట్లు తెలిపారు. మద్యం తాగడం వల్ల కుటుంబాలలో వివాదాలు ఏర్పడతాయని, ఆర్థికంగా చితికిపోతారని అన్నారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

రంగస్థల నటుడు సుబ్బారావు మృతి

మేదరమెట్ల: ప్రముఖ రంగస్థల నటుడు చలివేంద్ర సుబ్బారావు (57) ఆదివారం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలంలోని బొల్లవరప్పాడు గ్రామానికి చెందిన సుబ్బారావు వందలాది నాటకాల్లో పలు పాత్రలు పోషించారు. సత్యహరిశ్చంద్ర నాటకంలో విశ్వామిత్రుడు, కాలకౌసికుడు, వీరబాహుడు, పాత్రలతో పాటు చింతామణిలో సుబ్బిశెట్టి పాత్రలో జీవించి ప్రేక్షకులను మెప్పించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సుబ్బారావు పార్థివదేహానికి స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు స్నేహితులు తెలిపారు.

నిబంధనల మేరకే ఎరువులు విక్రయించాలి

- వ్యవసాయ శాఖ జేడీఏలు శ్రీధర్, కృపాదాస్
- ఎరువులు, పురుగు మందుల డీలర్ల సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం


ప్రమాణ సీకారం చేయిస్తున్న ఆతుకూరి ఆంజనేయులు, పాపిరెడ్డి తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): నిబంధనలకు లోబడి ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం జేడీఏలు వి.శ్రీధర్, వి.డి.వి.కృపాదాస్ సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎరువులు, పురుగు మందుల డీలర్ల సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం గుంటూరులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. తొలుత సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతు మనుగడను దృష్టిలో పెట్టుకొని అందరం కలసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు అందించి ఆదుకోవాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యవసాయ అధికారులు నున్న వెంకటేశ్వర్లు, ఐ.మురళి, ఎస్.కె.అబ్దుల్ సత్తార్, ఏడీఏలు సీహెచ్ రవికుమార్, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకట నాగిరెడ్డి

ఉమ్మడి గుంటూరు జిల్లా ఎరువులు, పురుగు మందుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వజ్రాల వెంకట నాగిరెడ్డి ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి, కాశీవిశ్వనాథం, కె.సుధాకరబాబు, కార్యదర్శిగా జి.రోశయ్య, కోశాధికారిగా జి.బాలకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా పి.వి.సత్యనారాయణ, ఆర్.చలపతిరావు, టి.ప్రసాద్ ఎన్నియ్యారు. వీరితో పాటు మరో 39 మంది ఈసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డి.పాపిరెడ్డి వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం


వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: తెనాలి మండలం హాఫ్‌పేట గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం చెందింది. వివరాలు.. పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన అమ్మిశెట్టి అనూరాధ(44) తన కొడుకుతో కలసి బైక్‌పై తెనాలి మండలం కొలకలూరు వెళ్తున్నారు. వెనక నుంచి వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో లారీ కింద పడి ఆమె అక్కడికి అక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న కుమారుడు మణికంఠ చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. అనారోగ్యంతో ఉన్న తన తల్లికి ఇంజెక్షన్ చేయించేందుకు వెంకటకృష్ణాపురం నుంచి కొలకలూరు గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకు వెళుతున్నట్లు మణికంఠ తెలిపాడు. దారి మధ్యలో వెనుక నుంచి తాము వెళ్తున్న పల్సర్ బైక్ సైలెన్సర్ ను లారీ ఢీకొనడంతో తల్లి లారీ కింద పడి మృతి చెందిందని వివరించాడు. మృతురాలు అనూరాధకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మృతురాలి కుమారుడి నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండె వ్యాధులపై అప్రమత్తం


శివప్రసాద్ హృదయాలయను ప్రారంభిస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండె వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుండె శస్త్ర చికిత్స నిపుణులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఎ.గోపాల కృష్ణ గోఖలే అన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ శివప్రసాద్ హృదయాలయను ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గోఖలే మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలను గుర్తించి గంటలోపు చికిత్స చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. మొదటి మూడు గంటల సమయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కార్డియాలజిస్టు డాక్టర్ పి.శివప్రసాద్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా కోస్తాంధ్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.